క్లుప్తంగా

విగ్రహావిష్కరణకు తరలిన పద్మశాలీలు



విగ్రహావిష్కరణకు తరలిన పద్మశాలి సంఘం నాయకులు

నిజాంపేట(మెదక్): స్వతంత్ర సమర యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఆవిష్కరణకు మంగళవారం మండలంలోని నస్కల్ గ్రామానికి చెందిన పద్మశాలి సంఘం నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెదక్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి తరలి వెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీలు మురళీ, గణేశ్, శ్రీనివాస్, సతీశ్, మహేశ్, శంకరయ్య, బాలనర్సు, పాండురంగం, శ్రావణ్ తదితరులు ఉన్నారు.

దళితబంధు అందరికీ ఇవ్వాలి



సర్పంచ్‌కు వినతిపత్రం అందిస్తున్న దళితులు

టేక్మాల్(మెదక్): దళితబంధు గ్రామంలోని దళితులందరికీ ఇవ్వాలని మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామంలోని మాల, మాదిగ వర్గాల వారు సర్పంచ్ స్వరూపకు వేర్వేరుగా వినతి పత్రం అందించారు. మంగళవారం ఈ సందర్భంగా దళితులు మాట్లాడుతూ.. దళితబంధు జాబితాల్లో అవకతవకలు జరుగుతున్నాయని, ఇస్తే అర్హులైన వారందరికీ ఇవ్వాలని కోరారు. గ్రామంలో అందరికీ దళితబంధు ఇవ్వలేనిపక్షంలో పథకాన్ని నిలిపివేయాలన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానని సర్పంచ్ తెలిపారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి



పాఠశాలలో సభ్యత్వం నమోదు చేస్తున్న దృశ్యం

కొల్చారం(నర్సాపూర్): ఉపాధ్యాయ, విద్యారంగా సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మండల తపస్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్ కుమార్, శ్రీకాంత్ అన్నారు. మంగళవారం రంగంపేట ఉన్నత పాఠశాలలో తపస్ మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ పాఠశాలలో పారిశుధ్య కార్మికులను నియమించాలని, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్సీలతో పాటు డీఏ బకాయిలను ఒకేసారి చెల్లించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తపస్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, నవీన్, సతీశ్, శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, అశోక్ ఉపాధ్యాయులు అరుణ, కవిత, నరేశ్‌చారి, ఉమా మహేశ్వరీ, రజిత, ఏసుకుమారి తదితరులు పాల్గొన్నారు

నియామకం



ములుగు నాగేశ్వర్‌రావు

శివ్వంపేట(నర్సాపూర్): మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడిగా దంతన్‌పల్లికి చెందిన ములుగు నాగేశ్వర్‌రావు నియమితులయ్యారు. బీఆర్‌ఎస్ సీనియర్ నేతగా పనిచేస్తున్న నాగేశ్వర్‌రావుని అందరి ఆమోదంతో నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి రైతు సమన్వయ సమితిగా నియమించినట్లు బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆమోదంతో నియామకపత్రం అందజేయనున్నారు.

సన్మానం



హన్మంతరావును సన్మానిస్తున్న శశీధర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ ఎంపీ హన్మంతరావును మంగళవారం మెదక్ మాజీ ఎమ్మెల్యే శశీధర్‌రెడ్డి సన్మానించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో హన్మంతరావు నివాసంలో కలిసిన శశీధర్‌రెడ్డి ఆయనతో పార్టీ విషయాలపై చర్చించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి కిషన్, నాయకులు శ్రీకాంత్‌గౌడ్, కేశవులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీ.. సమస్యల నిలయం

- మౌలిక సదుపాయాలు కరువు
- నిరుపయోగంగా మరుగుదొడ్లు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయులు



టేక్మాల్ ఎంఆర్‌సీలో నిరుపయోగంగా మరుగుదొడ్లు

టేక్మాల్(మెదక్): మండల కేంద్రం టేక్మాల్ వనరుల కేంద్రం (ఎంఆర్సీ కార్యాలయం)లో అనేక సమస్యలున్నాయి. అన్ని పాఠశాలకు ఆదర్శంగా ఉండాల్సిన వనరుల కేంద్రంలోనే మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. దీంతో సమావేశాలకు వచ్చే ఉపాధ్యాయులు, వివిధ పనులకోసం వచ్చే ప్రజలు ఇబ్బందులు అనేక అవస్థలు పడుతున్నారు. అయినా అధికారులెవరు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

నీటి వసతి లేదు

- టేక్మాల్ మండలంలో 37 ప్రాథమిక, 6 ప్రాథమికోన్నత, 7 ఉన్నత, ఒక మోడల్, ఒక కేజీబీవీ పాఠశాలలు ఉన్నాయి. యా
- అన్ని పాఠశాలల్లో కలిపి సుమారుగా 4200 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి బోధించేందుకు 177 మంది ఉపాధ్యాయులు ఉండగా 50 శాతం వరకు మహిళా ఉపాధ్యాయులు ఉంటారు.
- ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా విద్యాబోధన చేసిన మార్పులతో పాటూ పలు అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు కొన్నేళ్ల క్రితం లక్షల రూపాయాలు వెచ్చించి, మండల వనరుల కేంద్రాన్ని నిర్మించింది.
- భవనాన్ని నిర్మించి ఏళ్లు గడుస్తున్నా.. ప్రభుత్వం ఆ భవనానికి నేటికి నీటి వసతిని కల్పించలేదు. అవగాహన సదస్సులకు వచ్చే ఉపాధ్యాయులతో పాటూ ఇతర పనులకు వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఎంతో ఇబ్బంది పడుతున్నారు.
- ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాల ద్వారా వారానికి ఒకమారు టేక్మాల్ ఎమ్మార్సీ కార్యాలయానికి రావాల్సి ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. సమావేశాలు సుమారుగా 2–3 గంటల పాటూ జరుగుతుంటాయి.
- సమావేశాలకే కాకుండా విద్యార్థుల పుస్తకాలకు, దుస్తువులకు, ఆడిట్ తదితర పనులపై కార్యాలయానికి వస్తునే ఉంటారు.
- కనీసం తమకు తాగునీరు కూడా దొరక్క ఇబ్బంది పడాల్సి వస్తుందని వారు చెబుతున్నారు. మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉండడంతో తాము ఇబ్బందులకు గురవుతున్నట్లు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- అత్యవసర సమయాల్లో ఉపాధ్యాయులు తమ పనులను బహిర్భూముల్లోనే కానిచ్చేస్తున్నారు.
- పురుష ఉపాధ్యాయుల సంగతి ఎలాగున్నా మహిళా టీచర్ల పరిస్థితి మరింతగా వర్ణణాతీతంగా మారింది.
- అన్ని పాఠశాలలకు ఆదర్శంగా నిలవాల్సిన ఎమ్మార్సీ కార్యాలయంలోనే ఇలా సమస్యలుంటే మండలంలోని పాఠశాలలోని మౌలిక సదుపాయాలపై అధికారులు ఎలా దృష్టి సారిస్తున్నారని చెప్పకనే చెప్పవచ్చు.
- కార్యాలయం చుట్టు ముళ్ల పొదలు నిండిపోయాయి. కార్యాలయం ముందున్న మినీట్యాంక్‌కు సరిగ్గా ట్యాంపులు లేకపోవడంతో నీరంతా వృథాగా పోతూ ఆవరణ పూర్తిగా బురదమయంగా మారుతొంది.
- మండలానికి ఇన్‌చార్జ్ ఎంఈఓ కావడంతో చుట్టపుచూపుగా వస్తు, ఇలా ఇచ్చి అలా వెళ్తున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి.
- దీంతో సమస్యలు విలయతాండవం చేస్తున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.
- ఇకనైనా సంబంధిత జిల్లా అధికార యంత్రాగం చొరవ తీసుకొని ఎమ్మార్సీలో కనీస సదుపాయాలను కల్పించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



కౌడిపల్లి(నర్సాపూర్): మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తునికి నల్లపోచమ్మ ఆలయం వద్ద ఎమ్మెల్యే, రాష్ట్ర అధ్యక్షుడు లింగం ఆధ్వర్యంలో జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు స్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాయీ బ్రహ్మణుల సేవలను గుర్తించి, నర్సాపూర్‌లో సంఘం భవనానికి స్థలం కేటాయించి, రూ. 15లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయీ బ్రహ్మణ సంఘం రాష్ట్ర నాయకుడు జాన్సన్, జిల్లా అధ్యక్షుడు స్వామి, గౌరవ అధ్యక్షుడు రమేశ్‌కుమార్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రామాగౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, నాయకులు అమర్‌సింగ్, వెంకటేశం, విఠల్, నగేశ్, సంగమేశ్వర్, భిక్షపతి, వెంకటస్వామి, గణేశ్, లింగం, మల్లేశం, సంతోష్, లక్ష్మణ్, కిష్టయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): అనారోగ్యాలకు గురై చికిత్స చేయించుకోలేని నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ పథకం వరంగా మారిందని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన క్వార్టర్స్‌లో చిలప్‌చెడ్ మండలం అజ్జమర్రి గ్రామానికి చెందిన మాసగోని మహేశ్‌కు సంబంధించిన రూ. 28 వేల చెక్కు, బండపోతుగల్ గ్రామానికి చెందిన నర్సమ్మకు సంబంధించిన రూ.1 7వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అజ్జమర్రి సర్పంచ్ పరశురాంరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

‘మా గ్రామానికి ప్రాధాన్యం ఇవ్వండి’



ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌తో టేక్మాల్ సర్పంచ్, నాయకులు

టేక్మాల్(మెదక్): ప్రభుత్వం అందిస్తున్న దళితబంధు, బీసీ కులవృత్తుల్లో టేక్మాల్ గ్రామానికి ప్రాధాన్యం ఇవ్వాలని టేక్మాల్ సర్పంచ్ సుప్రజా అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌ను కోరారు. మంగళవారం అందోల్ ఎమ్మెల్యేను పోతులబోగుడలో కలిశామని సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టేక్మాల్‌లో అధిక జనాభా ఉందని దీంతో గ్రామానికి దళితబంధు, బీసీ కులవృత్తుల ఎంపికలో అధిక ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ఈ విషయమై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు భక్తుల వీరప్ప, మాజీ ఎంపీటీసీ కమ్మరి సిద్ధయ్య, బీఆర్‌ఎస్ జిల్లా యువత కార్యదర్శి నాయికోటి భాస్కర్, పార్టీ సీనియర్ నాయకులు చింత రవి, మహేందర్ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న గిరిజనులు

సీత్లా సంబురాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని సీతారం పంచాయతీ జగ్య తండాలో బుధవారం గిరిజనులు సీత్లా వేడుకలు ఘనంగా నిర్వహించారు. వర్షాలు సంమృద్ధిగా కురిసి రైతులు పాడి పంటలతో సంతోషంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి రోగాలు రాకుండా ఉండాలని పూజలు నిర్వహించినట్లు తండా పెద్దలు తెలిపారు. వేడుకల్లో తండా యువతి, యవకులు పెద్ద సంఖ్యంలో పాల్గొన్నారు. సీత్లా వేడుకలకు జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యుడు రవినాయక్ రూ. 6 వేల నగదు అందజేశారు.

నులిపురుగుల నిర్మూలనపై అవగాహన

రామాయంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో మంగళవారం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవంపై ఎంపీపీ సబిత, డాక్టర్ రవికుమార్ అన్ని శాఖల అధికారులతో కలిసి మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. నులి పురుగులు వల్ల శరీరంలో రక్తహీనత, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపునొప్పి, వికారం, విరోచనాలు, బరువు తగ్గడంతో మరిన్ని ఇబ్బందులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సత్యనారాయణ, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేగోడ్(మెదక్): ఈనెల 20 నుంచి 27 వరకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు పీహెచ్‌సీ సీహెచ్‌ఓ సిద్ధప్ప మంగళవారం తెలిపారు. పాఠశాలల్లో, పిల్లలందరికీ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

‘రేవంత్‌ను విమర్శించడానికే రైతు సదస్సులు’

వెల్దుర్తి(తూప్రాన్): తెలంగాణ ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై ప్రశ్నిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని విమర్శించడానికే బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు సదస్సులు నిర్వహిస్తుందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేశ్‌రెడ్డి ఆరోపించారు. వెల్దుర్తిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రం మాసాయిపేట రైతువేదికలో సోమవారం రైతు సదస్సు నిర్వహించి బీఆర్‌ఎస్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం విచారకరమన్నారు. ప్రజాధనంతో నిర్మించిన కార్యాలయాన్ని ఒక పార్టీ కార్యాలయంగా మార్చారని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీఆర్‌ఎస్‌కు రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

సమ్మెపై ప్రభుత్వం స్పందించాలి



నర్సాపూర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు

నర్సాపూర్: 13 రోజులుగా గ్రామ పంచాయతీ కార్మికులు నిరవధిక సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం స్పందించక పోవడం సిగ్గు చేటని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం నర్సాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట పలు గ్రామాలకు చెందిన గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి వర్షంలోనే సమ్మె చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు పీఆర్సీలో నిర్ణయించిన మేరకు వారికి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇతర వసుతులు కల్పించాలని ఆమె డిమాండ్ చేస్తూ సమస్యలు పరిష్కరించని పక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మెలో సీఐటీయూ ఉపాధ్యక్షుడు నాగరాజు, కార్మికులు శంకర్, ఎల్లం, రాములు, దుర్గయ్య, రవి, బందెల్లి, బాగయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



శివ్వంపేటలో..

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు శాంతియుతంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని పంచాయతీ కార్మికుల మండలాధ్యక్షుడు శంకర్ అన్నారు.

మండలంలో జోరందుకున్న నాట్లు



కొల్చారం(నర్సాపూర్): వరినాట్లు వేస్తున్న కూలీలు

కొల్చారం(నర్సాపూర్): మండల వ్యాప్తంగా మంగళవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన ముసురు, మధ్యలో రెండు మూడు జల్లులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పంట పొలాల్లోని మడుల్లో నీరు చేరింది. ఇప్పటికే వరి నాట్లు వేసిన రైతులు నీటిని దిగువ భాగాల్లోకి వదిలివేశారు. తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటలకు 22 మి.మీ. వర్షం నమోదు కాగా ఆ తర్వాత నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 27మి.మీ వర్షపాతం నమోదు అయింది. వర్షంతో ఇటు వరి పంటకు అటు పత్తి పంటకు మేలు చేకూరిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలో 28 మి.మీ. కురిసిన వర్షం నమోదు అయిందని మండల గణాంకాల శాఖ అధికారి వెంకటేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో తక్కువ వర్షపాతం నమోదు అయిందన్నారు. అయినప్పటికీ, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో 19.2 మి.మీ.ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు చిరుజల్లులతో కూడిన వర్షం పడుతూనే ఉంది. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు.

అల్లాదుర్గం(మెదక్): మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. తెల్లవారు జాము నుంచే వర్షం పడుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పాఠశాలలకు విద్యార్థులు అంతంత మాత్రంగానే హాజరయ్యారు.

చిన్నశంకరంపేట(మెదక్): రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మహేందర్ కోరారు. చిన్నశంకరంపేటలో 26.4 మి.మీ. వర్షంపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. అలాగే వర్షంలో విద్యుత్ సమస్యలు వస్తే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని, స్వయంగా ఎవరు కూడా రిపేరు చేయవద్దని కోరారు.



చిలప్‌చెడ్(నర్సాపూర్): బండపోతులగల్‌లో కాలువను తలపిస్తున్న రెండో వార్డు



కొల్చారం(నర్సాపూర్): సంగాయిపేట వద్ద పొలాల్లో చేరిన వర్షపు నీరు

పెద్దశంకరంపేట తహసీల్దార్‌గా గ్రేసీబాయి



పెద్దశంకరంపేట(మెదక్): పేట తహసీల్దార్‌గా గ్రేసీబాయి నియమితులయ్యారు. ఇక్కడ పని చేసిన ఇన్‌చార్జ్ తహసీల్దార్ చరణ్‌సింగ్ నిజాంపేట మండలానికి బదిలీపై వెళ్లారు. దీంతో పాటు జిల్లా కలెక్టరేట్ నుంచి మండల డిప్యూటీ తహసీల్దార్‌గా శ్రీనివాస్ మంగళవారం బదిలీపై వచ్చి తహసీల్దార్ బాధ్యతలు స్వీకరించారు.

రైతుబీమాకు దరఖాస్తులు చేసుకోవాలి

చిన్నశంకరంపేట(మెదక్): నూతన పట్టదారులు రైతు బీమాకు అర్హులైన దరఖాస్తులు అందించాలని వ్యవసాయ అధికారి లక్ష్మీప్రవీణ్ కోరారు. చిన్నశంకరంపేట, గవ్వలపల్లి, మడూర్, సూరారం గ్రామాల్లోని రైతు వేదికల వద్ద రైతులు రైతుబీమా దరఖాస్తులు అందించాలని తెలిపారు.

23న బోనం.. వనభోజనం

శివ్వంపేట(నర్సాపూర్): ఈ నెల 23న శివ్వంపేటలో వనభోజనాలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మండల కేంద్రం శివ్వంపేటలోని పెద్ద చెరువు కట్టవద్ద కొలువైన మత్తడి పోచమ్మకు బోనాలు సమర్పించడంతో పాటు వనభోజనాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అప్రమత్తంగా ఉండాలి: ఎస్‌ఐ



ఎస్‌ఐ సత్యనారాయణ

రేగోడ్(మెదక్): వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సత్యనారాయణ మంగళవారం సుచించారు. రానున్న నాలుగు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసిందని, గురు, శుక్రవారాల్లోనూ భారీగా వర్షాలు పడతాయని తెలిపిందని చెప్పారు. బుధవారంలోగా బంగాళాఖాతం వాయవ్య ప్రాంతంపై గాలులతో ఉపరితల ఆవర్తనం ఏర్పడనుందన్నారు. మరోవైపు జార్ఖండ్ దక్షిణ ప్రాంతంపై 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు మరో ఉపరితల ఆవర్తనం ఉందని, వీటి ప్రభావంతో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నందున భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని తెలిపారు. భారీ వర్షాల కారణంగా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, పాత గోడలు, ఇళ్లు కూలే ప్రమాదం ఉందని చెప్పారు. విద్యుత్ స్తంభాలు, ఎలక్ట్రిసిటీ వస్తువులను తడిగా ఉన్నప్పుడు తాకరాదని ఎస్‌ఐ కోరారు.

పురుషులకు ఉచిత శిక్షణ

నర్సాపూర్: రిఫ్రిజిరేటర్ ఎయిర్ ఎండిషన్‌ల మరమ్మతులో పురుషులకు ఎస్‌బీఐ ఉచిత శిక్షణ ఇస్తారని ఐకేపీ ఏపీఎం గౌరీశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డిలోని ఎస్బీ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 24 నుంచి నెల రోజుల పాటు ఉచిత శిక్షణ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. 19 సంవత్సరాలు నిండి 45 ఏళ్ల లోపు వ్యక్తులు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వ్యక్తులు ఈనెల 22లోపు సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అభ్యర్థులు మెదక్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన వారై ఉండాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత హాస్టల్ వసతి, భోజన వసతి, ఉచితంగా యూనిఫాం అందజేస్తారని వివరించారు. ఆసక్తి ఉన్న వ్యక్తులు ఫోన్ నంబర్లు 97044 46956, 94901 29839 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నివాళి

చేగుంట(తూప్రాన్): కేరళ మాజీ ముఖ్యమంత్రి ఉమెన్ చాందీ చిత్రపటానికి చేగుంట కాంగ్రెస్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నవీన్ మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ.. ఉమెన్‌చాందీ మరణం పార్టీకి తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, స్టాలిన్ ర్సింలు, ఫకీర్ నాయక్ తదిరులు ఉన్నారు.



ఉమెన్ చాందీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు